# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక ప్రైవేటు ఆసుపత్రి, నైపుణ్య విశ్వ విద్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.**

2. **ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు  స్పష్టం చేశారు.**

3. **తిరుపతిని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

4. **జాతీయ పంచాయతీ అవార్డులు-2026లో ప్రత్యేక విభాగం కింద రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖకు మూడు అవార్డులు లభించాయి.**

=========================

అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటించారు. మంగళగిరి మండలం నిడమర్రు వద్ద ఏర్పాటు చేయనున్న ఒక ప్రైవేటు ఆసుపత్రి, నైపుణ్య విశ్వ విద్యాలయం నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

..వాయిస్.. 30 సెకన్లు

అంతకుముందు కేంద్రమంత్రి  పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ..

..వాయిస్.. 25 సెకన్లు

-------------------------

రాష్ట్రంలో రొయ్యల మేత ధరల పెంపుపై వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజయవాడ నుంచి దృశ్యమాధ్యమం ద్వారా ఈ రోజు సమీక్ష  నిర్వహించారు. ఈ సమావేశంలో రొయ్యల మేత 7తయారీ సంస్థల ప్రతినిధులు, ఆక్వా రైతులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రొయ్యల మేత ధరలను ఏకపక్షంగా పెంచడం సరికాదని ఒక్కసారిగా ధరలు పెరగడం వల్ల ఆక్వా రైతులపై తీవ్ర

భారం పడుతుందని చెప్పారు. రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, అధికారులతో మరోసారి ఉమ్మడి సమావేశం నిర్వహించి, అందరి అభిప్రాయాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఆక్వా రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

---------------------------

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు – ఎంఎస్ఎంఈలకు పెట్టుబడి మార్కెట్లపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈరోజు సాయంత్రం విజయవాడలో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ ఇనీటియాల్ పబ్లిక్ ఆఫరింగ్ 'ఎస్ఎంఈ ఐపీఓ' అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు నిధుల సమీకరణ, పెట్టుబడి అవకాశాలపై ప్రత్యేక కార్యశాల నిర్వహించనున్నారు. అలాగే 'ఎన్ఎస్ఈ ఎమర్జ్' వేదిక ద్వారా చిన్న పరిశ్రమలకు స్టాక్ మార్కెట్ ద్వారా ఆర్థిక బలాన్ని అందించే అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్ , కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

---------------------------

తిరుపతిని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారిని మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణానికి పలు సంస్థలకు అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. తిరుమల, తిరుపతి ఆధ్యాత్మిక కేంద్రాలతో చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

జాతీయ పంచాయతీ అవార్డులు--2026లో ప్రత్యేక విభాగం కింద రాష్ట్రానికి మూడు అవార్డులు లభించాయి. వాతావరణ చర్యల విభాగంలో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన కందులవారిపల్లె పంచాయతీ, ఆత్మనిర్భర్ విభాగంలో చిత్తూరు జిల్లా ఐరాల మండలానికి చెందిన కాణిపాకం పంచాయతీ అవార్డులు సాధించాయి. అలాగే క్షమత నిర్మాణ్ సర్వోత్తం సంస్థాన్ పురస్కారానికి చిత్తూరు జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఎంపికైంది.

దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా స్పందిస్తూ జాతీయ పంచాయతీ అవార్డులు--2026లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీలు సాధించిన విజయాలు గర్వకారణమని మెరుగైన పాలన, పారదర్శకతతో గ్రామ స్వరాజ్యాన్ని సాధిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఉద్యోగులను అభినందించారు. జాతీయ స్థాయిలో లభించిన ఈ అవార్డులను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణాభివృద్ధిలో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.

---------------------------

బీసీ సంక్షేమ వసతి గృహాల శాశ్వత భవనాల నిర్మాణానికి 500 కోట్ల రూపాయలు మంజూరు చేశామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన గురుకులాలు, బీసీ హాస్టళ్ల విద్యార్థులను విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంత్రి నిన్న సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పరీక్షల ఉత్తీర్ణతలో మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు.

---------------------------

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామంలో వంతెన, రహదారి పనులకు, ముస్లిం షాదీ ఖానా కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.ఏ షరీఫ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మొత్తం 4 కోట్ల 52 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

విశాఖపట్నం నగరంలోని జ్ఞానాపురం హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరమని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ అన్నారు. జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్‌ను ఆయన ఈరోజు సందర్శించి వర్తకులు, కార్మికులు, రైతు ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలు పెద్ద స్థాయిలో జరుగుతున్నప్పటికీ, పార్కింగ్, లోడింగ్--అన్‌లోడింగ్, రహదారులు, నిల్వ సదుపాయాలు, పారిశుధ్యం, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాల్లో మౌలిక సదుపాయాల విస్తరణకు చర్యలు తీసుకుకోవాలని తెలిపారు.

---------------------------

దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమర జవానుల సంతానాన్ని గౌరవించుకునేందుకు ప్రతి సంవత్సరం మే 13న అమర సైనికుల పిల్లల దినోత్సవం 'చిల్డ్రన్ ఆఫ్ ఫాలెన్ పేట్రియాట్స్ దే'గా నిర్వహిస్తుంటారు. యుద్ధాలు, పోరాటాల్లో అమర వీరులైనవారి పిల్లల త్యాగాలను, వారికి తగిన సాయం అందాల్సిన అవసరాన్ని గుర్తు చేసుకుంటూ ఈరోజును నిర్వహిస్తారు.

---------------------------

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 20వ తేదీన విజయవాడలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ ఉద్యోగ మేళాలో ప్రముఖ ప్రయివేటు సంస్థలల్లో ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు.

=====================